క్లుప్తంగా

పెళ్లికుమారుడైన వేణుగోపాలుడు



తిరువూరు: నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి వారిని ఆలయ ఉప ప్రధానార్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, నిత్యపూజ అనంతరం పెళ్లికుమారుడిగా అలంకరణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో విష్వక్సేన పూజ, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తుహోమం, ధ్వజారోహణం, బలిహరణం తదితర కార్యక్రమాలను తొలిరోజు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ నంద్య, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కళాశాలలో అకడమిక్ ఆడిట్

మైలవరం: మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్ బుధవారం నిర్వహించారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ఇంగ్లిష్ శాఖాధిపతి ఎ.రోజాలిన్, తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన డాక్టర్ ఆర్.ప్రవీణ్ దత్తు, సభ్యులతో కూడిన పరిశీలనా బృందం కళాశాలలోని క్లాసులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, ఎల్ఎంఎస్ స్టుడియో, ఆడిటోరియం వంటి ఆధునిక వసతులను చూసి ప్రశంసించారు. కళాశాల అభివృద్ధికి పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'పై ప్రచారం

మైలవరం: పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, టెండర్ల విషయంలో హైకోర్టు తీర్పులు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పిలుపు మేరకు మైలవరం పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ఆంజనేయపురం(తిరువూరురూరల్): పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టడానికి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆంజనేయపురంలో బుధవారం గాలికుంటు నిరోధక వ్యాక్సిన్ వేశారు. పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా యజమానులు ఈ టీకాలు తప్పక వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వప్న కోరారు. సర్పంచి మామిడి కుటుంబరావు, వెటర్నరీ అసిస్టెంట్ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: చాట్రాయి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించారు. రోడ్ల పక్కన చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

ఆగిరిపల్లి: కనసానపల్లిలోని కోదండరాముని ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదాంతం రవికుమార్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, విమాన శిఖర ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి నిర్వహించారు. సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పరీక్ష సామగ్రి అందజేత

ఆగిరిపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న 170 మంది విద్యార్థులకు బుధవారం గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్స్, పరీక్ష సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు బీబీఎస్ లక్ష్మి, జె.వెంకటేశ్వరరావు, అల్లా బక్షు, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

సారా నిందితుల బైండోవర్

విస్సన్నపేట: వేమిరెడ్డిపల్లి తండాలో సారా తయారీ, అమ్మకాలకు పాల్పడుతున్న నిందితులను ఎక్సైజ్ అధికారులు బుధవారం అరెస్టు చేశారు. తండాకు చెందిన 17 మంది నిందితులను విస్సన్నపేట తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశామని ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా విస్సన్నపేటలో సారా తయారీ, అమ్మకాలు, తాగడం వలన కలిగే అనర్థాలను తెలుపుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సారా నిషేధిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

నిందితుల అరెస్టు

చాట్రాయి: సారా అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో సారా అమ్మకాలు నిర్వహించిన కేసుకు సంబంధించి విజయలక్ష్మి, కటారి కుమారి, వడిత్యా సక్రు, బాణావతు బాలులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్టుకు తరలించామని చెప్పారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- మాజీ మంత్రి జోగి రమేష్
- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జోగి రమేష్, పాల్గొన్న నాయకులు



తుక్కులూరులో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రతాప్ అప్పారావు

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని మాజీ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాలను నాయకులు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు మాట్లాడుతూ పార్టీ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలులను వివరించారు. ఇబ్రహీంపట్నం గాంధీ విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి జోగి రమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో 29 రాష్ట్రాలు ఉండగా ఏపీలో మాత్రమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అక్కచెల్లెమ్మలకు నేరుగా సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ప్రశ్నిస్తామన్న వారు అధికార పక్షంలో చేరి చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమయంలో జగనన్న ఉండి ఉంటే ఇప్పటికే సంక్షేమ పథకాలు అందించేవారని, రాష్ట్రంలో మహిళలు చెప్పుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా విద్యుత్ బిల్లులు, నిత్యావసరాల ధరలు భారీగా పెంచి ప్రజల నెత్తిన అధిక భారం మోపిందని విమర్శించారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తామని, గతంలో మాదిరిగా అన్ని వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు అవుతాయనే ఆశాభావం ప్రజల్లో వ్యక్తమవుతోందని చెప్పారు. అనంతరం విజయవాడలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్లారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జి.కొండూరు జెడ్పీటీసీ మందా జక్రధరరావు, ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు వేములకొండ తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు మేడపాటి నాగిరెడ్డి, వాహెద్, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ వి.రాంబాబు, పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, జోగి రాము, ఎస్.శివశంకరరావు, పండు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల కోసం తపించే నేత జగన్..

మైలవరం: మైలవరం పాత ఆస్పత్రి సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసం పరితపించే నాయకుడు అని అన్నారు. పార్టీ మండల అధ్యక్షులు గర్నేపూడి వెంకట్రావు, న్యాయవాది ఓర్సు శ్రీనివాసరావు, నిరీక్షణ్ కుమార్, ఉప సర్పంచ్ చామల సీతారామిరెడ్డి, టి. ఏసు తదితరులు పాల్గొన్నారు.

పోరాట పటిమతో ముందుకు సాగుదాం

నూజివీడు: ప్రజల కోసం పోరాటమే ఊపిరిగా ముందుకు సాగుదామని, వైఎస్సార్ సీపీ అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల పక్షాన పోరాడతామని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం నూజివీడు మండలం తుక్కులూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ప్రతాప్ ఎగురవేశారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతాప్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రజల సంక్షేమమే ఊపిరిగా పాలన సాగించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే లక్ష కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేటట్లు చేయడమేనా పాలన అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కిన ఘనత చంద్రబాబుదేనని విమర్శించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు అహర్నిశలూ కష్టపడి పనిచేయాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ఇంజినీరింగ్ కాలేజీలను ఏర్పాటు చేస్తే వాటన్నింటిని చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేసేందుకు పావులు కదుపుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల రామస్వామి, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, బెజవాడ రాంబాబు, తుక్కులూరు సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, నాయకులు ఆరేపల్లి రాంబాబు, పాలడుగు విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం..

నాయకులు కోట దాసు, చెరకు నరసారెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, కోట కోటేశ్వరరావు, కొత్తగుండ్ల నరసింహారావు, నల్లగట్ల బాలు, చింతల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తునికిపాడులో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. గంపలగూడెం గాంధీ బొమ్మ సెంటరులో జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. రామ్మోహన్ థియేటర్ సెంటర్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం విస్సన్నపేటలో నిర్వహించారు. ఎ. కొండూరు రోడ్డులోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు నెక్కలపు కుటుంబరావు, సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ భూక్యా రాణి, నాయకులు సిరసాని ప్రకాష్, మల్లయ్య, మేడా తిరుపతిరావు, రెడ్డి శేషగిరి, కోట శ్రీనివాసరావు, రెడ్డి నటరాజు, కాలేషా తదితరులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న బెజవాడ రాంబాబు



జి.కొండూరు వేడుకల్లో ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



మైలవరం వేడుకల్లో నాయకులు

ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం..

తిరువూరు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ప్రజల పక్షానే పోరాడుతోందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కలకొండ రవికుమార్ అన్నారు. తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేసిన అనంతరం రవికుమార్ మాట్లాడారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో జనరంజక పాలన సాగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని విమర్శించారు. తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్ తదితరులు దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్ రెడ్డి, మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, షేక్ నదియా, గుంటూరు మస్తాన్, నాయకులు గత్తం నాగేశ్వరరావు, షేక్ జాకీర్, రేగళ్ల మోహన్‌రెడ్డి, యరదేశి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అధికారంలోకి వస్తేనే సంక్షేమం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు పునఃప్రారంభమవుతాయని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆదేశాల మేరకు బుధవారం గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలోను, పంచాయతీ కార్యాలయం వద్ద, మైలురాయి సెంటర్‌లో పార్టీ జెండాలను ఆవిష్కరించి కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనలో రెండేళ్ల కోవిడ్ కాలంలో కూడా సంక్షేమ పథకాలను నిర్విఘ్నంగా కొనసాగించిన ఘనత జగనన్నదేనని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయిలో బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంకు సత్యనారాయణ, పరసా చెన్నారావు, మిద్దె శివాజీ, వనమా వాసు, రాజేష్, దారా రాజు, బండి శ్రీనివాసరెడ్డి, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం మండలంలో..

గంపలగూడెం మండలం తోటమూలలో పార్టీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్,

- **జి.కొండూరు:** వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జి.కొండూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు వేములకొండ విష్ణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ఆగిరిపల్లి: ఎన్నికల ముందు యువతకు, విద్యార్థులకు, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు అన్నారు. బుధవారం మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను రాంబాబు ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసం పరితపించే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. అనంతరం భారీ ర్యాలీతో యువత పోరుకు, యువకులు, నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో ఏలూరుకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, సాదం గోపీనాథ్, సుజనా కుమారి, రవి శేఖర్, నక్కనబోయిన శ్రీమన్నారాయణ, జి.హనుమంతరావు, వాకా సక్కేశ్వరరావు, చిమటా శ్రీనివాసరావు, కంబాల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జిల్లా కార్యాలయం వద్ద వేడుకల్లో నాయకులు అవినాష్, స్వామిదాసు, భాగ్యలక్ష్మి, వెలంపల్లి తదితరులు



తలశిల రఘురాం కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



గంపలగూడెం తోటమూల సెంటర్‌లో పతాకాన్ని ఆవిష్కరించిన వినయ్‌కుమార్



చాట్రాయిలో జెండాను ఆవిష్కరిస్తున్న సుబ్బారెడ్డి నాయకులు, కార్యకర్తలు



విస్సన్నపేటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న లోకేశ్వరరెడ్డి, నాయకులు

అప్పులు, అమ్మకాలతో అమరావతి నిర్మాణమా?

నూజివీడు: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం పూర్తిగా అప్పులతోనూ, రైతులు ఇచ్చిన భూములు నాలుగు వేల ఎకరాలను అమ్మగా వచ్చిన డబ్బుతో రాజధానిని నిర్మిస్తామని పాలకులు చెప్పడం సిగ్గుచేటని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ బుధవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. రాజధాని నిర్మాణం పేరిట సేకరించిన భూములు అమ్ముకునే హక్కు మీకు ఎవరిచ్చారని హరినాథ్ ప్రశ్నించారు. అవసరాలకు మించిన భూములను తిరిగి రైతులకు ఇచ్చి వేయాలని హరినాథ్ డిమాండ్ చేశారు.



కూటమికి 'ఫీజు'లెగిరేలా..

ఉవ్వెత్తున ఎగసిన యువతరంగం

కూటమి తొమ్మిది నెలల పాలనపై యువాగ్రహం నిరసన గళమై నినదించింది. ఫీజులివ్వని బాబు సర్కారుకు ఫ్యూజులు మాడిపోయేలా విద్యార్థిలోకం నిప్పులు చెరిగింది. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ మాయ హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వంపై సింహనాదమై గర్జించింది. ఎన్ని ఆంక్షలు విధించినా.. పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా లెక్క చేయక పదం పదం కలిపి కదంతొక్కింది. విజయవాడలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు సాయం

తిరువూరు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు పెరిగిన నిర్మాణ వ్యయం కారణంగా ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందజేస్తుందని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో మంజూరు చేసిన యూనిట్ ధరకు అదనంగా ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున మంజూరు చేయనున్నామని చెప్పారు. తిరువూరు డివిజన్‌లో 896 మంది లబ్ధిదారులకు ఈ విధానం ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. వీరిలో ఎ.కొండూరు మండలంలో 187 మంది, గంపలగూడెం మండలంలో 95 మంది, రెడ్డిగూడెం మండలంలో 228 మంది, విస్సన్నపేట మండలంలో 116, తిరువూరు అర్బన్‌లో 114 మంది, తిరువూరు రూరల్‌లో 106 మందికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

రెడ్డిగూడెం తహసీల్దార్ ఆకస్మిక తనిఖీలు

తిరువూరు: రెడ్డిగూడెం మండలంలోని చౌకధరల దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తహసీల్దారు జె. సుశీలాదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాగులూరు ఎంపీపీ స్కూల్, జిల్లా పరిషత్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన తహసీల్దారు పాత నాగులూరులోని మూడు చౌకధరల దుకాణాల్లో స్టాకును, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు సరఫరా చేసిన రేషన్‌ను తనిఖీ చేశారు. గ్రామంలో పీ4 సర్వే తీరును పరిశీలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టరు గంధం పుల్లయ్య, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: స్థానిక రైతు బజార్‌లో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ శాఖాధికారి మంగమ్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న పది దుకాణాలు అర్హులైన డ్వాక్రా సంఘాలకు కేటాయించామన్నారు. ఆసక్తి కలిగిన డ్వాక్రా సంఘాల సభ్యులు ఈ ప్రకటన వెలువడిన వారంలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను స్థానిక రైతు బజార్ ఎస్టేట్ అధికారి, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ గొల్లపూడి వారి కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

మారెమ్మ హుండీ కానుకల ఆదాయం రూ. 7.20 లక్షలు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలోని హుండీలలో భక్తులు వేసిన కానుకలను ఆలయ అధికారులు బుధవారం లెక్కించారు. 70 రోజులకు గాను రూ.7 లక్షల 20 వేల 796 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ తెలిపారు. దేవదాయ శాఖాధికారులు పర్యవేక్షించారు.